బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో ఏప్రిల్, మే నెలలలో నిర్వహించిన బీటెక్ ఫలితాలు బుధవారం విడుదల అయ్యాయి. బీటెక్ నాలుగవ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్20, 19, 15) సప్లిమెంటరీ, బీఫార్మసీ ఒకటవ సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్ 23, 19, 15) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల అయ్యాయి. డైరెక్టర్ అఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య వి.నాగ ప్రసాద్ నాయుడు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎపి.శివ కుమార్, అడిషినల్ కంట్రోలర్స్ ఆచార్య జి.శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఎం.అంకారావు వీటిని విడుదల చేశారు.

ఫలితాలను విడుదల చేస్తున్న జెఎన్‌టియు అధికారులు

ఉన్నత విద్యపై నిర్లక్ష్యం..!

◆ డిగ్రీ ప్రవేశాలు ఎప్పుడో..?
◆ ఇంటర్ ఫలితాలు విడుదలై రెండు నెలలు
◆ ఇప్పటి వరకు డిగ్రీ ప్రవేశాలకు విడుదల కాని షెడ్యూల్

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యపై పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నట్లు కన్పిస్తోంది. డిగ్రీ ప్రవేశాల విషయంలో ఉన్నత విద్యా శాఖ తీవ్ర జాప్యం చేస్తోంది. గత ఏడాది కూడా ఇలాగే ఆలస్యంగా అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టడంతో అనేక కాలేజీల్లో పదుల సంఖ్యలో సీట్లు మిగిలిపోయాయి. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలోని 83 కళాశాలల్లో సగానికి పైగా కళాశాల్లో 50 శాతం సీట్లు కూడా భర్తీకాలేదు. అడ్మిషన్లు ఆలస్యం కావడమే దీనికి ప్రధాన కారణం అని తెలుస్తోంది. గత ఏడాది తలెత్తిన ఇబ్బందులను కనీసం ఈ ఏడాదైనా ఎదురు కాకుండా ఉండాలంటే వేగంగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తిచేయాలని ఉన్నత విద్యా శాఖకు పలు కళాశాలల ప్రతినిధులు ఇప్పటికే విజ్ఞప్తి చేశారు. అయినప్పటికీ ఉన్నత విద్యా శాఖ పట్టించుకోలేదు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ ఇప్పటికీ ప్రారంభం కాలేదు. ఇంటర్ ఫలితాలు విడుదలై రెండు నెలలు పూర్తి అవుతున్నా ఇప్పటి వరకూ డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల కాలేదు. దీంతో ఇంటర్ పూర్తి చేసుకుని డిగ్రీలో చేరాలనుకున్న విద్యార్థులందరూ అయోమయంలో ఉన్నారు. ఇప్పటికే విద్యా సంవత్సరం పున:ప్రారంభమైంది. ఈ నెల 12 నుంచి పాఠశాలలు తెరిచారు. ఇంటర్ తరగతులు కూడా ఈ నెల 1 నుంచే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో డిగ్రీ అడ్మిషన్లపై ప్రభుత్వం నేటికీ స్పష్టత ఇవ్వలేదు. దీంతో వేలాది మంది విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. డిగ్రీ విద్యను నిర్లక్ష్యం చేయడం వెనుక ప్రయివేటు, కార్పొరేట్ ఇంజినీరింగ్ కాలేజీల మనుగడ కోసమే అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పరిస్థితి ఇలా ఉంటే ప్రయివేటు కళాశాలలు మాత్రం సీట్లు భర్తీ చేసుకునే పనిలో పడ్డారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రయివేటు డిగ్రీ కళాశాలలో ఇప్పటికే విద్యార్థులను కళాశాలల్లో చేర్చుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ లేక పోవడంతో విద్యార్థులు విద్యాసంవత్సరాన్ని కొంత భాగం కోల్పోయే ప్రమాదం ఉంది. చదువులకు దూరంగా ఉండటం వలన చెడు వ్యసనాలకు గురయ్యే ప్రమాదం ఉందంటూ తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మిగులుతున్న సీట్లు

శ్రీ కృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో 86 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 73 ప్రయివేటు, 10 ప్రభుత్వ, మూడు అటానమస్ కాలేజీలు ఉన్నాయి. ఆయా కాలేజీల పరిధిలో సుమారు 35 వేలకుపైగా సీట్లు ఉన్నాయి. సాధారణంగా అయితే 60 నుంచి 70 శాతం మేర సీట్లు భర్తీ అవుతుంటాయి. గడిచిన మూడేళ్ల నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ఆలస్యం అవుతుండడంతో భారీగా సీట్లు మిగిలిపోతున్నాయి. గతేడాది అడ్మిషన్ల ప్రక్రియను ఆలస్యంగా నిర్వహించడం, మూడు విడతలకు మధ్య ఎక్కువ రోజులు ఖాళీ రావడంతో ప్రవేశాలు మరింత తగ్గాయి. గత విద్యా సంవత్సరం దాదాపు 40 కళాశాలలకు పైగా 50 శాతం సీట్లు కూడా భర్తీకాలేదు. కొన్ని గ్రూపుల్లో 10 నుంచి 15 మంది మాత్రమే చేరారు. విద్యార్థుల సంఖ్య తగ్గిన అనేక గ్రూపుల్లో అడ్మిషన్లు నిలిపివేయాలని ఆయా కాలేజీలు నిర్ణయించాయి. గత అనుభవాలను దష్టిలో పెట్టుకుని ఈ ఏడాది అయినా ప్రవేశాలకు సంబంధించిన ఇబ్బందులు లేకుండా చూడాలని ఉన్నత విద్యాశాఖను ప్రైవేటు కాలేజీల అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు. అడ్మిషన్లకు సంబంధించి ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసిన తరువాత మూడు దశల్లో అడ్మిషన్లు ప్రక్రియ పూర్తి చేయడానికి కనీసం రెండు నెలలు సమయం పడుతుంది. అది కూడా వేగంగా చేస్తే ఈ ప్రక్రియ పూర్తవుతుంది. ప్రవేశాలు కల్పించడం ఆలస్యమైతే సీట్లు భారీగా మిగిలిపోతాయి. ఆగస్టు నెలలోగా అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేస్తే కొంతలో కొంతైనా మేలు కలుగుతుందన్న భావనను ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఉన్నత విద్యాశాఖ ఎప్పటి నుంచి డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభిస్తుందో చూడాల్సి ఉంది.

సత్యసాయి శతజయంతి వేడుకలను వైభవంగా నిర్వహిద్దాం

◆ తల్లికి వందనం ఈకేవైసీని పూర్తి చేయించండి ◆ కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి బాబా శత జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేలా అధికారులందరూ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, సత్యసాయి ట్రస్టు సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వి.రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్‌ఒ విజయసారథి, సత్యసాయి ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎవరికి అప్పగించిన విధులను వారు బాధ్యతతో నిర్వర్తించాలన్నారు. వీఐపీలు, వివిఐపిలు ఈ వేడుకలకు హాజరుకానున్నారని తెలిపారు. వీరందరికీ కోసం ఆరు హెలీప్యాడ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా తాత్కాలిక వసతి ఏర్పాట్లు, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రైల్వే స్టేషన్ సమీపంలో తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్, పోలీస్ బందోబస్తు, రవాణా సౌకర్యం, నిరంతర విద్యుత్ సరఫరా, పట్టణ సుందరీకరణతో పాటు, చిత్రావతి నది సుందరీకరణ, భద్రతా చర్యలు తదితర అంశాలపై ప్రత్యేక దష్టి సారించి బాధ్యతాయుతంగా సంబంధిత అధికారులు విధులు నిర్వర్తించాలన్నారు. హారతి ఇచ్చే చిత్రావతి ఘాట్ వద్ద, కమ్మవారిపల్లి, కప్పల బండ, ఎంఎస్‌ఎం ఈ పాయింట్స్ వద్ద భారీ గేట్లు ఏర్పాటు చేసి భద్రత సిబ్బందిని నియమించాలన్నారు. వివిధ మార్గాల్లో వచ్చే భక్తులకు రహదారి సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి తగినన్ని మందులు సిద్ధంగా ఉంచుకోవాలని డిఎంహెచ్‌ఒను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయ ప్రసాద్, ఆర్డీవో సువర్ణ, డిఎంహెచ్‌ఒ ఫిరోజ్ బేగం, ఆర్టీసీ డిపిటిఒ మధుసూదన్, విద్యుత్ ఎస్‌ఈ సంపత్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

21న జరిగే యోగాంధ్రను కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 21న జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు జరిగే యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం నాడు కలెక్టరేట్లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తో కలిసి జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులు, తహశీల్దారులు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21న జిల్లాస్థాయి యోగా కార్యక్రమాన్ని హిందూపురం ఎంజిఎం మైదానంలో నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం నాటికి ఈ ప్రాంతాన్ని అన్ని వసతులతో సిద్ధం చేయాలని తెలియజేశారు. ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలన్నారు. తల్లికి వందనంకు సంబంధించి ఈ కేవైసీ వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సువర్ణ, జెడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డి, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు నరసయ్య, విజయ ప్రసాద్, పాల్గొన్నారు.

రాయితీ వ్యవసాయ యంత్ర పరికరాలు పంపిణీ

జిల్లాలో 2024-25 సంవత్సరానికి సబ్సిడీపై మంజూరు అయిన వ్యవసాయ యంత్ర పరికరాలను కలెక్టర్ టిఎస్.చేతన్ రైతులకు అందజేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో 1021 మంది రైతులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.1.72 కోట్లతో రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు రాయితీపై మంజూరు అయ్యాయని చెప్పారు. రోటవేటర్లు, బ్రష్ కట్టర్లు, మతుకలు, నూర్పిడి యంత్రాలు వంటివి రైతులకు అందిచినట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ ఎఫ్‌పిఒ ప్రతినిధులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి రైతులకు చేపడుతున్న కార్యక్రమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎఫ్‌పిఒలు రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలను తెలియజేశారు. అనంతరం సబ్సిడీ యంత్ర పరికరాలకు మంజూరైన మెగా చెక్కును రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వైవి.సుబ్బారావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు మెగా చెక్కును అందిస్తున్న కలెక్టర్

చేయి ఎత్తిన చోట ఆగుతున్న ఆర్టీసీ బస్సులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని ప్రయాణికులు చేయి ఎత్తిన చోటే ఆర్టీసీ బస్సులను ఆపుతున్నారు. ప్రయాణికులను ఎక్కించుకోకుండా నిర్లక్ష్యంగా బస్సులు వెళుతున్న ఘటనలపై ప్రజాశక్తి దినపత్రికలో వారం రోజుల క్రితం ' ఆగని ఆర్టీసీ బస్సు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఆ శాఖ ఉన్నతాధికారులు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు పలు సూచనలు చేశారు. దీంతో ప్రయాణికులు ఉన్న చోట బస్సులను ఆపి వారికి బస్సులో ఎక్కించుకుంటున్నారు. దీంతో ప్రయాణికులకు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాగ్వాదం చేసుకుంటున్న సభ్యులు

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం

టిడిపి, వైసిపి సభ్యుల వాగ్వాదం

ప్రజాశక్తి - తాడిమర్రి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం రసాబాసగా కొనసాగింది, టిడిపి, వైసిపి సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. తల్లికి వందనం పథకం అమలుపై వైసిపి సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒక ఎకరం భూమి ఉన్నవారికి 12 ఎకరాల భూమి ఉన్నట్టు చూపిస్తూ తల్లికి వందనం ఎగ్గొట్టారని విమర్శించారు. రామాపురం అగ్రహారం గ్రామాలలో గత ఏడాది నుండి ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం లేకపోవటం వల్ల ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీల మధ్య ఉన్న వర్గపోరుతో కూలీలకు ఉపాధి పనులు లేకుండా చేయడం తగదని అన్నారు. పథకాల అమలు, పలు అభివృద్ధి కార్యక్రమాలపై టిడిపి, వైసిపి సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సమావేశంలో ఎంపిపి భువనేశ్వరరెడ్డి, తహశీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎఒ అనిల్‌కుమార్‌రెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' కోసం తల్లులు ప్రదక్షిణలు

455 మంది విద్యార్థులకు వర్తించని పథకం

సచివాలయాల చుట్టూ తిరుగుతున్న కుటుంబసభ్యులు

సచివాలయం వద్ద విద్యార్థుల కుటుంబసభ్యులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి తల్లికి వందనం పథకం వర్తింపజేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత నిబంధనలు పెట్టడం వల్ల తల్లికి వందనం లబ్ధిదారుల్లో విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండలంలో 5,214 మంది విద్యార్థులు తల్లికి వందనం పథకానికి అర్హులు కాగా 455 మంది విద్యార్థులకు కోత విధించారు. వారందరికీ నగదు జమ కాలేదు. పథకం అందని తల్లులు పాఠశాలలు, సచివాలయాలు, బ్యాంకుల చుట్టూ బ్యాంకు పాస్ పుస్తకాలు చేతపట్టుకొని కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో చివరి సంవత్సరం ఈ పథకం ద్వారా లబ్ధి పొందలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గత ఏడాది విద్యార్థులు తల్లులు ఎదురుచూసినా ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయలేదు. దీంతో రెండు సంవత్సరాలు నష్టపోయామని ఇప్పుడు ప్రభుత్వం అందించే తల్లికి వందనం పథకం అందుతుందా లేదా అని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు తల్లులకు గతంలో వేసిన బ్యాంకు ఖాతా కాకుండా వేరే బ్యాంకు ఖాతాకు డబ్బులు పడ్డాయని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు.

రీ సర్వేలో లోపాలతో ఇక్కట్లు

మండల వ్యాప్తంగా గత ప్రభుత్వం చేపట్టిన భూములు రీసర్వేలో జరిగిన చోట తప్పులు తడకగా వివరాలు నమోదు చేయడంతో రెండు, మూడు ఎకరాలు కూడా లేని వారికి ఎక్కువ ఎకరాల భూమి ఉన్నట్లు జాబితాలో కనబరిచారు. దేమకేతేపల్లి గ్రామానికి చెందిన 78 మందికి ఒక ఎకరా ఉంటే ఎక్కువ ఎకరాల పైన చూపిస్తోంది. ఇలా మండల వ్యాప్తంగా పలువురు అర్హులను 'తల్లికి వందనం' జాబితాలో అనర్హులుగా చూపడంతో ఆయా విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో సచివాలయం దగ్గర పడిగాపులు కాస్తున్నారు.

తల్లికి వందనం వర్తింపజేయాలంటూ కార్మికుల వినతి

మండలంలోని టేకులోడు మహాత్మా జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ పాఠశాలలో కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న 15 మంది కార్మికులు, సిఐటియు నాయకులు తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. 9 ఏళ్లగా సేవలందిస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా చూపి తల్లికి వందనం పథకం నుండి తప్పించారని వాపోయారు. తక్కువ వేతనాలతో జీవనం సాగిస్తున్న తమకు ఈ పథకం వర్తింపజేయాలని కోరుతున్నారు.

ఒక సెంటు భూమి కూడా లేదు

నాకు సెంటు భూమి కూడా లేదు. నాకు ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రెండు సంవత్సరాలు ఈ పథకం రాలేదు. ఇప్పుడు కూడా ఈ పథకం తమకు వర్తించలేదు. సచివాలయంలో అధికారులను అడిగితే 26 ఎకరాల భూమి ఉందని అనర్హుల జాబితాలో చేర్చారని చెబుతున్నారు. నాకు అంత భూమి ఉంటే తల్లికి వందనం అవసరం లేదు.

సురేష్,
మొరంపల్లి

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-నంబులపూలకుంట

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు జగన్మోహన్ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. అనంతరం సిఐటియు మండల ఏర్పాటు చేశారు కన్వీనర్ గా నాగరాజు కోకన్వీనర్గా బాబాజీ. దర్బార్ రెడ్డితో పాటు 11 మంది కమిటీ సభ్యులతో మండల కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగిరెడ్డి, మల్లిరెడ్డి, గుర్రయ్య, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ కోసం విద్యార్థుల పడిగాపులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణం సమీపంలోని మలుగూరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలుర గురుకులంలో ప్రిన్సిపల్ కోసం విద్యార్థులు ఉదయం నుంచి పడి కాపులు కాశారు. ఆ పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తయిన విద్యార్థులు టిసి, స్టడీ, కాండక్ట్ తదితర ధ్రువీకరణ పత్రాల కోసం వివిధ ప్రాంతాల నుండి వచ్చారు. ఉదయం నుండి ప్రిన్సిపల్ కోసం విద్యార్థులు పడిగాపులు కాసినా ప్రయోజనం లేకపోయింది. పాఠశాల సిబ్బంది మాత్రం ప్రిన్సిపల్ బ్యాంకుకు వెళ్లారని చెబుతున్నారే కాని ఆయన మాత్రం అందుబాటులోకి రాలేదని పలువురు విద్యార్థులు వాపోయారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో హోటళ్లు కూడా లేకపోవడంతో ఉదయం నుంచి అన్నం కూడా తినకుండా ఆకలితో ప్రిన్సిపల్ కోసం ఎదురు చూశామని చెప్పారు. ధ్రువీకరణ పత్రాల కోసం వివిధ ప్రాంతాల నుండి అనేక వ్యయప్రాయాసాలకు గురై వచ్చామని పేర్కొన్నారు. బ్యాంకు పని కోసం వెళ్ళిన ప్రిన్సిపాల్ వస్తారో, రారో తెలియని అయోమయంలో విద్యార్థులు సతమతమయ్యారు.

పాఠశాల ముందు వేచి ఉన్న విద్యార్థులు

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల ప్రజలు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రాలు సమర్పించారు. బుధవారం పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథి గృహంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ప్రజలు తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. ఈసందర్భంగా పలువురు విన్నవించిన పలు సమస్యలను ఎమ్మెల్యే అక్కడికక్కడే పరిష్కరించారు. సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

మాజీ కౌన్సిలర్ కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం మున్సిపల్ పరిధిలోని శ్రీకంఠపురానికి చెందిన మాజీ కౌన్సిలర్ గంగప్ప కుటుంబానికి టిడిపి నాయకులు ఆర్థికసాయం అందజేశారు. గంగప్ప సతీమణి గంగమ్మ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక సమస్యలతో ఇబ్బందులకు గురవుతోంది. విషయం తెలిసిన వెంటనే టిడిపి కార్యాలయం రూ. 10 వేలు, కౌన్సిలర్ గిరి రూ.10 వేలు, టిడిపి నేతలు వెంకటేష్, మహేష్ లు రూ.5 వేల చొప్పున బాధిత కుటుంబ సభ్యులకు రూ.30 వేలు అందజేశారు. టిడిపి తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, వారి కుటుంబసభ్యులకు అండగా ఉంటుందని ఈసందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు టైలర్ గంగాధర్, ఆటో మూర్తి, బి. ఎన్. మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-హిందూపురం

గొల్లపల్లి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి ఉన్న ఏడు నెలల వేతనాలను వెంటనే మంజూరు చేయాలని ఎఐటియుసి నాయకులు కోరారు. ఈ మేరకు ఆసంఘం ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు వినోద్ కుమార్ మాట్లాడుతూ గొల్లపల్లి రిజర్వాయర్ తాగునీటి పథకం కార్మికులకు ఏడు నెలల వేతనాలు బకాయి ఉన్నాయన్నారు.. వెంటనే సంబంధిత వేతనాలు చెల్లించాలని, కోరారు. అధికారులు స్పందించకపోతే ఈనెల 24వ తేదీ నుండి గొల్లపల్లి వాటర్ వర్కర్లు సమ్మెలోకి వెళతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారుతి రెడ్డి, గొల్లపల్లి రిజర్వాయర్ వాటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు రమేష్, హరి, ఓబులేసు, మంజు, ఉమేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - కదిరి టౌన్

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆబ్యాంకు చీఫ్ మేనేజర్ హరిప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ,పేర్కొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 70 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం కదిరి మెయిన్ బ్రాంచ్ నందు కదిరికి సంబంధించిన నాలుగు శాఖల ఆధ్వర్యంలో సిబ్బంది రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నిదానాలలో కెల్లా గొప్పదనం రక్తదానమని అన్నారు.ఈ కార్యక్రమంలో చీఫ్ మేనేజర్ హరిప్రసాద్ డిప్యూటీ మేనేజర్లు వెంకటేష్ కుమారు సుజిత రీజనల్ ఆఫీసు శశిధర్ కుమార్ స్టాఫ్ ఇసాక్ నాయక్ సుధీర్ కుమార్ బ్యాంకు బ్యాంకు వాల్ యువర్ సోషల్ వర్కర్ కొమ్ము విజయ భాస్కర్ ర్యాక్ చీఫ్ మేనేజర్ శ్రీహరి కుమార్ మేనేజర్స్ పార్థసారథి, విశ్వేశ్వర గౌడ్ ఖాతాదారులు , బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు

బియ్యం పంపిణీ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మొటుకుపల్లి పంచాయతీ లోని నిరుపేద కుటుంబాలకు కదిరి రూరల్ పీవీర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేతుల మీదుగా 50 కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కదిరి రూరల్ మండల కన్వీనర్ చెన్నకేశవులు , మాజీ సర్పంచి చంద్ర, మనోహర్, జయచంద్ర, పవన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి గోరంట్ల

మండలంలోని వానవోలు తండా గ్రామ పొలాల్లో మండల వ్యవసాయ శాఖ అధికారి శంకర్ నాయక్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శంకర్ నాయక్ మాట్లాడుతూ వేరుశనగ లో విత్తన శుద్ధి భూసార పరీక్ష ఆధారంగా ఎరువుల వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు

తల్లికి వందనం అమలుపై హర్షం

ప్రజాశక్తి - కదిరి టౌన్

తల్లికి వందనం పథకం అమలుపై టిడిపినాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని టవర్ క్లాక్ దగ్గర ఉన్న పార్క్ స్కూల్ లో టిడిపి కదిరి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ అధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

బిటి రోడ్డు ఏర్పాటుకు భూమి పూజ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం ప్రభుత్వాసుపత్రి ఆవరణంలో బిటి రోడ్డు ఏర్పాటుకు బుధవారం భూమిపూజ చేశారు. మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి, డాక్టర్ వివేక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - నల్లచెరువు

నల్లచెరువు గ్రామంలో సీతా రాముల ఆలయ నిర్మాణానికి దాతలు విరాళం అందజేశారు. రామకష్ణారెడ్డి, కుమారుడు కనిమిరెడ్డి ప్రహల్లాద రెడ్డి 50,116 రూపాయలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ఎనుగొండ దశరథ రామయ్య నాయుడు, పడుచూరి నగేష్ కుమార్, వెంకటరమణ రెడ్డి, అల్లాపల్లి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాలివ్వాలని వినతి

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని కోరుగుట్టపల్లి వాసులు తమకు ఇళ్లపట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక తహశీల్దార్ రెడ్డి శేఖర్‌ను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. తమ గ్రామంలోని 10, 47 సర్వే నెంబర్లఓ 1.50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఇందులో అర్హులైన వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు నాగరాజు, వెంకటస్వామి, సరస్వతి, లక్ష్మీదేవి, రాజు బాబు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

20న కదిరిలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

కదిరిలో ఈనెల 20న 11 బహుళ జాతీయ కంపెనీలతో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య సంస్థ అధికారి బండ్ల హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 20న ఉదయం 9 గంటలకు కదిరిలో ఎస్ టి ఎస్ ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి - బత్తలపల్లి

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చునని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జ్యోతి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని టీచర్స్ కాలనీలో డ్రైనేజీ ఏర్పాటుకు టిడిపి నేతలతో కలిసి భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో,వీధులలో, ఇంటి పరిసరాలలో అపరిశుభ్రత లేనప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉండగలరన్నారు. ఇంటి పరిసరాలలో మురుగునీరు, వర్షపు నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యంగా చేతి పంపులు, తాగునీటి కుళాయిల వద్ద మురుగునీరు లేకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు. మండల పరిషత్ నిధులతో డ్రైనేజీ ఏర్పాటు చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు జక్కంపూడి నాగభూషణం,ఉమ్మాల చంద్రశేఖర్, బిజెపి నాయకులు కావేటి మల్లికార్జున, సచివాలయ ఇంజనీర్ శివశంకర్,కుమ్మర సాంబశివుడు,కాలనీవాసులు పాల్గొన్నారు.

యోగాపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి-హిందూపురం

యోగాపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిలో చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా హిందూపురం పట్టణంలో జూన్ 21వ తేదీన స్థానిక ఎంజీఎం మైదానంలో పెద్ద ఎత్తున యోగాంధ్రను నిర్వహించేందుకు జరుగుతున్న ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్‌తో పాటు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున బుధవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈఈ వాణి, మున్సిపల్ ఏఈ ధీరజ్, టీడీపీ నాయకులు దుర్గా నవీన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తల్లికి వందనం గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - చెన్నేకొత్తపల్లి

విద్యాసామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే

తల్లికి, చెల్లికి న్యాయం చేయకుండా బాధపెట్టిన వ్యక్తి తల్లికి వందనం గురించి మాట్లాడే అర్హత లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో సర్వేపల్లి రాధాకష్ణన్ విద్యా మిత్ర పాఠశాల కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే సునీత విద్యార్థులకు సర్వేపల్లి రాధకష్ణన్ విద్యా మిత్ర కిట్లు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్ చదువుకు పెద్దపీట వేస్తున్నారన్నారు. పాఠశాలలంటే దేవాలయాలని అలాంటి చోట కూడా గత ప్రభుత్వ పాలకులు రాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో వైసీపీ నేతలు ఏంచేయాలో దిక్కుతోచక నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. కనీసం తల్లికి కూడా గౌరవం ఇవ్వలేని జగన్ రెడ్డి నేడు తల్లికి వందనం గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కుట్ర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రయివేటు పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించని ధర్మవరం ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఖతిజున్ కుబ్రాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నామాల నాగార్జున మాట్లాడుతూ ధర్మవరంలోని ప్రయివేటు పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదన్నారు, డబ్బుకే ప్రాధాన్యత ఇస్తూ డొనేషన్ల రూపంలో అడ్మిషన్ ఫీజు పేర్లతో సెమీ రెసిడెన్షియల్ పేరుతో అనేక రకాలుగా తల్లిదండ్రులతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. నిబంధనలు పాటించని ప్రయివేటు పాఠశాలలపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శ్రీనాథ్, పట్టణ ఉపాధ్యక్షులు అమన్, బాలాజీ, చిన్ను తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

విద్యార్థి కావ్యకు మెరిట్ స్కాలర్ షిప్ అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

విలువలతో కూడిన విద్య విద్యార్థుల భవిష్యత్తును బంగారుమయం చేస్తుందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప అన్నారు. పాంచజన్య పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు, పాంచజన్య భారతి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అధ్యక్షతన బుధవారం పాఠశాలలో పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ కనబరిచి, ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఆర్థిక ఇబ్బందులు ఉన్న 16 మంది విద్యార్థులకు ఆర్థిక చేయూతను అందించారు. ఒక్కొక్కరికి రూ.10వేల ప్రకారం రూ. 1.60లక్షలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతు ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వాహకులు కేవలం ధనార్జనే ధ్యేయంగా కాకుండా సేవా భావంతో విద్యను అందించాలన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సేవ కోసమే పాంచజన్య శ్రీనివాసులు విద్యాలయాన్ని స్థాపించి ఎంతో మందికి విద్యాదానం చేస్తున్నారన్నారు. ప్రతి సంవత్సరం పదవ తరగతిలో మంచి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు వారి ఉన్నత చదువుల కోసం స్కాలర్ షిప్‌ను అందించడం అభినందనీయమన్నారు.. పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతు శ్రీ సత్యనారాయణ శెట్టి, తాయారమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ, లేట్ ఎం భాగ్యలక్ష్మి గారి సహకారంతో ప్రతి సంవత్సరం 10వ తరగతి ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన వారికి ఇంటర్మీడియట్ చదువు కోసం ఆర్థిక సహాయం చేస్తున్నామన్నారు. తమ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసి, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాదిస్తే రూ.1లక్ష, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాదిస్తే రూ.25వేలు, పాఠశాల స్థాయిలో ఆత్యదిక మార్కులు సాదించిన విద్యార్థులందరికి రూ.10 చొప్పున ఆర్థిక చేయూతను అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ డిఎస్ నందకుమార్, ఎఓ భాస్కర్, పాఠశాల హెచ్ఎం గాయత్రి, సూపరిండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, షేక్ అబ్దుల్ రజాక్, సతీష్ కుమార్, ఉపాధ్యాయులు ఫ్రాన్సీన, కీర్తి ప్రియతో పాటు ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - రొద్దం

మండలంలోని రెడ్డిపల్లి పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలగా పని చేసిన ఇద్దరు ఉపాధ్యాయులు మరో ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లడంతో వారిని గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి చేసిన కృషిని ఈసందర్భంగా వారు గుర్తుకు తెచ్చుకున్నారు. లక్ష్మీనారాయణ మండలంలోని ఆర్. మరవపల్లి కి బదిలీపై వెళ్లగా , జయచంద్ర మండలంలో దొడగట్ట ఎస్సీ కాలనీలోని పాఠశాలకు బదిలీ అయ్యారు. అదేవిధంగా లక్ష్మీ నాయక్ పెనుగొండ మండలం ఇస్లాపురం ప్రభుత్వ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. వీరిని నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులు గౌరీ శంకర్, లలితమ్మ తో పాటు గ్రామస్తులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గ్రామస్తులు జైపాల్ రెడ్డి, మధు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి మడకశిర

సమస్యల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఎంఎస్.రాజు ఆదేశించారు. బుధవారం పట్టణంలోని 4, 17వ వార్డుల్లో టీ టైమ్ విత్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పట్టణ వాసులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబందిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజు, సుభద్ర నాగేంద్ర, మేఘన రమేష్, విక్రమ్, ఉమా శంకర్, హనుమంతు వైజాగ్ రమేష్, బుల్లెట్ శంకర్, జనసేన కన్వీనర్ శివాజీ, నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తాం : ప్రజల సమస్యలను పరిష్కరించడానికే 'పల్లెనిద్ర' కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. మంగళవారం రాత్రి నియోజకవర్గ పరిధిలోని అమరాపురం మండల పరిధిలోని వి అగ్రహారం గ్రామంలో నిర్వహించిన 'పల్లెనిద్ర' కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని ప్రజల సమస్య లను అడిగి తెలుసుకున్నారు. రాత్రి వరకు ప్రజాసమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్యే తిప్పేస్వామి అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలోనే బస చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, మండల కన్వీనర్లు ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని నేతులపల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న యుటిఎఫ్ మహంతి, పూర్వ విద్యార్థి విజయలక్ష్మి రవీంద్ర చెళ్ళకెర ఆధ్వర్యంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యాసామగ్రిని బుధవారం అందజేశారు. విద్యార్థులకు సంవత్సరమునకు సరిపడరాత పుస్తకములు,పలకలు,పెన్నులు,పెన్సిళ్లు బలపములను అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

గోరంట్ల : మండలంలోని బూదిలి గ్రామ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన విద్యా సామాగ్రిని కూటమి నాయకులు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి, నాయకులు సోమశేఖర్, నరేష్ ఉత్తమ్ రెడ్డి వేణు రాయల్ నిమ్మల శ్రీధర్ శ్రీనివాసులు బాలాజీ బ్రహ్మచారి ఈడిగ రవి జనసేన పార్టీ నాయకులు సంతోష్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :పట్టణంలోని ధర్మపురం దుర్గాబాయ్ దేశ్ ముఖ్ మున్సిపల్ స్కూల్, పి.కె.ఎస్.ఆర్ ఓరియంటల్ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు యూనిఫారమ్, పుస్తకాలు, బెల్ట్, బూట్లు తదితర విద్యాసామాగ్రి బుధవారం మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణను కూడా అలవర్చుకోవడం చాలా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఆయూబ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెన్నోబులం, సూర్య నారాయణ, ఎంఈఓ లు గంగప్ప, ప్రసన్న లక్ష్మీ, విద్యా కమిటీ చైర్మెన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన కూటమి : వైసిపి

ప్రజాశక్తి-పెనుకొండ

కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని వైసిపి నాయకులు విమర్శించారు. ఈ మేరకు వారు బుధవారం పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి పూల మాలవేసి నివాళు లర్పించారు. అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వాల్మీకి విభాగ అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, మండల ప్రజా ప్రతినిధులు మండల నాయకులు 'జగన్ అంటే నమ్మకం, బాబు అంటే మోసం' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు బోయ నరసింహలు, మండలకన్వీనర్ సుధాకర్ రెడ్డి, నాగలూరు బాబు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండల పరిధిలోని ఆకుతోటపల్లి నాగుల కట్ట వద్ద ధర్మపురి పంచాయతీలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని స్వచ్ఛంద సంస్థల సమన్వయకర్త డాక్టర్ సత్య నిర్ధారన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫెర్రర్ వర్ధంతిని ప్రాముఖ్యమైన రోజులుగా భావించి అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల ప్రోత్సాహక దినోత్సవముగా ప్రకటించినందున ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. సంస్థ అధినేత సోమల రాజు శివరాజు ఆదేశాల మేరకు పంటి వైద్యులు మనోజ్ కుమార్, నేత్ర సహ వైద్యులు నాగరాజు తదితరులు ఆరోగ్య విషయాలపై పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో హార్ట్‌ఫుల్ సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసులు, బళ్లారి కుంటిమల సత్యనారాయణ, ధర్మవరం మున్సిపల్ కౌన్సిలర్ కేత లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు తహశీల్దార్‌గా నటరాజన్

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు తహశీల్దార్‌గా నటరాజన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ధర్మవరంలో తహశీల్దార్ గా పనిచేస్తున్న ఆయన బదిలీ పై చిలమత్తూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి వంతు కృషి చేస్తానని, రైతులకు సమస్యలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని కోరారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో వీఆర్వోలు, సర్వేయర్లు బాధ్యతగా పని చేయాలన్నారు.

వాడీవేడిగా మండల మీట్

ప్రజాశక్తి - బత్తలపల్లి

స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. కొందరు అధికారులు, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అర్హులకు, నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందకుండా పోతున్నాయని పలువురు ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా సమావేశానికి కొందరు అధికారులు గైర్హాజరు కావడంతో వారిపైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపాలని తీర్మానించారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. రీ-సర్వే లోపాలపై కీలక ప్రశ్నలు సంధించారు. -సర్వేలో జరిగిన పొరపాట్లు కారణంగా రైతు కుటుంబాలకు, ఎస్సీ, ఎస్టీలకు తల్లికి వందనం. సుఖీభవ పథకాలు, సంక్షేమ పథకాలకు దూరమవుతున్నాయని సర్పంచు కరుణాకరేయుడు, ఎంపీపీ బగ్గిరి త్రివేణ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి వారు మండల వ్యాప్తంగా చాలా మంది ఉన్నారని నిలదీశారు. ఇదే సమస్యతో దంపెట్ల గ్రామంలో అనేక మంది ఉన్నారని సభ దష్టికి తీసుకువచ్చారు. ఈ పొరపాట్లుకు గల కారణాలపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని, దీనివల్ల నష్టపోతున్న రైతులకు న్యాయం చేయాలని రెవెన్యూ శాఖను ఆయన నిలదీశారు. అదేవిధంగా సుఖీభవ పధరం కూడా రీ సర్వే వల్ల రైతులకు న్యాయం జరగకపోగా, నష్టమే జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూడాలని, ఇందుకోసం సర్వే లోపాలను తక్షణమే సరిదిద్దాలని అధికారులను కోరారు. దంపెట్ల పంచాయతీలోని స్కీం బోర్డుకు ఉన్న మోటారు కేబుల్ వైర్లు పలుమార్లు దొంగతనం జరిగినా పోలీసులను ఆశ్రయిస్తే కేసు నమోదు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీఓ ఆదెప్ప ఉపాధి హామీ వరకు గురించి వివరించగా రైతులను కూలీలుగా మారకుండా వారికి ఇవ్వాల్సిన బిల్లులు వెంటనే చేయాలన్నారు. ఉపాధిహామీ పథకంలో రైతులకు వివిధ నిర్మాణాలు చేపట్టి వాటికి బిల్లులు చెల్లించకపోతే ఎలా అని నిలదీశారు. తహసీల్దార్ స్వర్ణలత సమావేశాలకు హాజర్ కావడంలేదని, ప్రజా ప్రతినిధులు. లెక్కలేనితనంగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసమావేశంలో ఎంపిడిఒ నరసింహనాయుడుతో పాటు ఆయాశాఖల అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులను నిలదీసిన సభ్యులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బత్తలపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న తమ్ముడిని ఆసుపత్రికి ద్విచక్రవాహనంలో తీసుకొని వస్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడటంతో తమ్ముడు మృతి చెందిన సంఘటన మండలంలోని దంపెట్ల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. దంపెట్ల గ్రామానికి చెందిన పొత్తూరి. వెంకటస్వామి కుమారుడు రమేష్ (39) అనారోగ్యంతో బాధపడుతుండగా అతని అన్న వెంకటరమణ రమేష్‌ను ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రికి బయలుదేరారు గ్రామ చివరన నాగేశ చంద్రశేఖర్ నాయుడు ఇంటి వద్దకు రాగానే వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెనుక కూర్చున్న రమేష్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండలంలోని వెంకట సాయి ఐటిఐ సమీపంలో హైవే వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కదిరి రూరల్ మండలం చెందిన బాషా ద్విచక్రవాహనంలో వస్తూ ఐటిఐ సమీపంలో హైవే వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన డివైడర్ను ఢీకొని కిందికి పడ్డాడు. గాయపడిన బాషాను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం 108 వాహనంలో కదిరికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి - గోరంట్ల

మండలంలోని మల్లాపల్లి పంచాయతీ కొత్తపల్లి గ్రామానికి చెందిన టిడిపి యువ నాయకుడు దేవా నరేష్ (36) బుధవారం విద్యుత్ షాక్‌తో మృతిచెందాడు. తన ఇంటికి బోరుబావి నుండి పైపులైను వేసుకున్నారు ఇంటికి నీరు కావాల్సి ఉండగా నరేష్ స్టార్టర్ ఆన్ చేసే సమయంలో ఫీజు వేస్తుండడంతో షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో నరేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడిని భార్య ఇద్దరు, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

21 నుంచి పాలిసెట్ కౌన్సిలింగ్

ప్రజాశక్తి-హిందూపురం

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలిటెక్నిక్ లో ప్రవేశాలకు ప్రభుత్వం షెడ్యూల్ ను విడుదల చేసిందని స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ హరినాథ బాబు తెలిపారు. స్థానిక ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో హెల్ప్ లైన్ సెంటర్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సెంటర్ ద్వారా ఈ నెల 21 నుంచి 28 వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. కౌన్సెలింగ్ కు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 20 నుంచి 27వ తేదీ లోపు ప్రాసెసింగ్ ఫీజు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 250, ఓసి, బిసి అభ్యర్థులు రూ. 700 ఆన్ లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందన్నారు. కౌన్సిలింగ్ కు హాజరయ్యే అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు రసీదు, పాలీసెట్ హాల్ టికెట్, ర్యాంక్ కార్డ్, పదవ తరగతి మార్క్స్ మెమో, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికేట్స్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ట్రాన్స్ ఫర్ సర్టిఫికేట్ ఒరిజినల్స్ తో పాటు రెండు సెట్ల నఖలు తీసుకురావాలన్నారు. ఈ నెల 25 నుంచి 28 తేదీ వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. జూలై 3న సీట్లు కేటాయింపు ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు స్థానిక మహిళా పాలిటెక్నిక్ కళాశాల ను సంప్రదించాలని సూచించారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని పాఠశాలల కళాశాలల విద్యార్థులకు శక్తి యాప్ పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మహిళల భద్రతకు శక్తి యాప్ ద్వారా శక్తి టీం బృందాలు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. పాఠశాలలు కళాశాలలు ప్రారంభం కావడంతో శక్తి యాప్ యొక్క ఆవశ్యకత ప్రాధాన్యత శక్తి యాప్ ద్వారా అందించే సేవల గురించి అవగాహన కల్పించారు. పుట్టపర్తి మండల పరిధిలోని మేడపల్లి ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో మహిళా పిఎస్ డీఎస్పీ ఆదినారాయణ పర్యవేక్షణలో శక్తి టీమ్ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రొహిబిషన్, ఎక్సైజ్ పుట్టపర్తి స్టేషన్‌ను ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య , అసిస్టెంట్ ప్రొహిబిషన్ , ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్ బుధవారం తనిఖీ చేశారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమం లో భాగంగా పుట్టపర్తి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల మండలాలను నాటు సారాయి రహిత మండలాలుగా తయారు చేయాలని సూచించారు. ఈసందర్భ:గా అనుమానిత వ్యక్తులను , పట్టుబడిన నేరస్తులను బైండోవర్ చేశారు. మద్యం షాపుల్లో లైసెన్స్ నిబంధనలకు అనుగుణంగా మద్యం విక్రయించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమం లో ప్రొహిబిషన, ఎక్సైజ్ ఎస్ఐ శివ ప్రసాద్ , హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయుడికి సన్మానం

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండల పరిధిలోని అచ్చమియా పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడిగా ఉద్యోగోన్నతి పొందిన గౌస్ లాజంను గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఇస్మాయిల్,అబుల్ , వెంకటేష్,హరి, తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూనే పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేసి ప్రజల మన్ననలు పొందిన గౌస్ లాజం ప్రధాన ఉపాధ్యాయుడుగా ఉద్యోగోన్నతి పొందడం హర్షనీయమన్నారు. అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలను, యూనిఫాం .విద్యార్థులకు పంపిణీ చేసి, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండల కేంద్రంలోని పలు కాలనీలలో విద్యుత్ లైన్ మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శివయ్య తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బత్తలపల్లిలోని తహశీల్దార్ కార్యాలయం, ఆర్డీటీ ఆసుపత్రి, పాతవూరు, ఎస్టీ, ఎస్సీ కాలనీలు, ఇందిరమ్మ కాలనీ, కోటి కాలనీ, కదిరి రోడ్, ధర్మవరం రోడ్, తాడిమర్రి రోడ్ జగనన్న కాలనీలో లైన్ మరమ్మతులు ఉన్నాయన్నారు. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. గురువారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరుకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని ఏఈ శివయ్య కోరారు.

అంగన్వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని అంగన్వాడీ కేంద్రాలలో బుధవారం ప్రారంభించినట్లు సిడిపిఒ జయంతి తెలిపారు. ఇందులో భాగంగా పుట్టపర్తి మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం అంగన్వాడీ కేంద్రాలలో సిడిపిఒ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్వాడి కేంద్రాలకు పంపాలని, అమ్మ ఒడి తరువాత మొదట బడి అంగన్వాడీ కేంద్రమని చెప్పారు. ఈ కేంద్రాలలో నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహార,ం మధ్యాహ్నం వేడి భోజనం, ఉదయం గుడ్డు పాలు ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు పుట్టపర్తి ఎం సుజాతమ్మ, కొత్తచెరువు రజిత, అంగన్వాడి కార్యకర్తలు శైలజ ,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి తనిఖీ

ప్రజాశక్తి - తలుపుల

తలుపుల కేజీబీవీని ఎంపీడీవో కె. నసీమ బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్నభోజన పథకం అమలు, పిల్లల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తలుపుల కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ వై మోహనమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.